క్లుప్తంగా

నూతన రేషన్‌కార్డుల పంపిణీ



కోస్గి రూరల్: పేద, మధ్య తరగతి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకట్రాములు, ఓంప్రకాశ్ అన్నారు. మండలంలోని ప్రజలకు మంజూరైనా రేషన్‌కార్డులను ఆదివారం ఇంటింటికీ పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ నూతన కార్డుదారులకు సెప్టెంబరు నుంచి రేషన్ దుకాణాల్లో సరుకులు పొందాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్‌కార్డులు అందజేయడం ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో కృష్ణయ్య, దేవయ్య, సిద్ధయ్య, వెంకటయ్య, బాలకిష్టయ్య, చిన్న వెంకటయ్య తదితరులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



ధన్వాడ: 64వ తెలంగాణ రాష్ట్ర స్థాయి అంతర్ పాఠశాలల సుబ్రతో కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు నారాయణపేట జిల్లా తరపున కొండాపూర్ గిరిజన గురుకుల పాఠశాలకు చెందిన బాలుర ఫుట్‌బాల్ జట్టు అర్హత సాధించిందని కోచ్ రామ్మోహన్‌గౌడ్ తెలిపారు. ఈ టోర్నమెంట్ ఆగస్టు 25 నుంచి 26వ తేదీ వరకు రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని గురుకుల విద్యాపీఠ్‌లో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులను ప్రిన్సిపల్ రాజారాం ఆదివారం అభినందించారు.

ఆంజనేయస్వామి ఆలయ కమిటీ ఎన్నిక

కొత్తపల్లి: మండలంలోని ఆంజనేయ స్వామి ఆలయ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు భూనీడ్ గ్రామస్తులు తెలిపారు. ఆదివారం ఆలయ సమీపంలో గ్రామపెద్దల సమక్షంలో ఎన్నిక నిర్వహించి అధ్యక్షుడిగా కొత్తూర్ హన్మంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా మంగలి నాగరాజు, నీరటి శ్రీను, కోశాధికారిగా హన్మంతు యాదవ్, సలహాదారుడుగా మొనయ్యాచారిను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

సురవరం సేవలు మరువలేనివి



మరికల్: సీపీఐ పార్టీ అగ్రనేత మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి సేవలు మరవలేమని సీపీఐ మండల అధ్యక్షుడు రాము అన్నారు. మండల కేంద్రంలో సీపీఐ పార్టీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళ్లులర్పించారు. అనంతరం మాట్లాడుతూ పేదల వెంట ఉన్న ఏకై క నాయకుడు సుధాకర్‌రెడ్డి అన్నారు. అటువంటి మహానేత కోల్పోవడం సీపీఐకు తీరని లోటన్నారు. ఆయన ఆశయాలను కార్యకర్తలందరూ కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ కార్యకర్తలు, హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి



అమరచింత: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఈ నెల 25, 26న నిర్వహించే ఏఐయూకేఎస్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజన్న పిలుపునిచ్చారు. మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆదివారం మండలంలోని ధర్మాపూర్, పాంరెడ్డిపల్లి గ్రామాల్లో రైతులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల పంటలకు ఎమ్మెస్పీ చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతు ప్రయోజనాలను దెబ్బతీయడంతో పాటు వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేయడానికే కేంద్ర ప్రభుత్వం యోచిస్తుందని ఆరోపించారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం అన్నదాతలు సమష్టిగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు.

నవరాత్రులు.. జాగ్రత్తలు తప్పనిసరి

- మండపాల ఏర్పాటులో నిబంధనలు పాటించాలి
- సొంతంగా విద్యుత్ పనులతో అనర్థాలు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న అధికారులు



ప్రతిష్ఠాపనకు సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు

మాగనూర్: వినాయక నవరాత్రోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మండపాల వద్ద అప్రమత్తత అవసరం. ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంది. మండపాల అలంకరణ మొదలు నిమజ్జనం వరకు జాగ్రత్తగా వ్యవహరించకపోతే ప్రాణాలు కూడా పోవచ్చు. అదే పలు జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాల నుంచి బయటపడొచ్చు. ప్రస్తుతం ఎక్కడ చూసినా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పలుచోట్ల విద్యుత్ తీగలు వేలాడడం, ఎర్తింగ్‌వైర్లకు సైతం విద్యుత్ సరఫరా అయ్యే అవకాశముంది. దీంతో చిన్న చిన్న జాగ్రత్తలు తీసుకుంటే ఉత్సవాలను ఆనందంగా పూర్తి చేసుకోవచ్చు.

పాటించాల్సిన జాగ్రత్తలు..

- వినాయక మండపాల వద్ద విద్యుత్ పనులను సొంతంగా చేయకపోవడం మంచింది. స్తంభాల లైన్‌ల కింద మండపాలు ఉంటే ఎప్పటికప్పుడు విద్యుత్ తీగలను పరిశీలించాలి.
- మండపానికి విద్యుత్ కనెక్షన్ తీసుకునే సమయంలో బోర్డు, మెయిన్‌స్విచ్ ఉపయోగించాలి.
- విద్యుత్ సరఫరాను తీసుకెళ్లే తీగలు అతుకులు లేకుండా చూడాలి. అతుకులు నీటిలో తడిసిన ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అలాగే ప్లాస్టిక్ వైర్లు అతుకులతో కూడినవి ఇన్సులేషన్‌లేని వైర్లను ఎట్టి పరిస్థితుల్లో ఉపయోగించరాదు.
- మండపాలు ఊరేగింపునకు ఉపయోగించే వైరును నాణ్యత ఉన్న కంపెనీలవే వాడాలి.
- అలంకరణకు వాడే లైట్లు, ఇతర లైట్ల వైరింగ్ నేల నుంచి కనీసం ఏడు అడుగుల ఎత్తులో ఉండేలా చూడాలి.
- చిన్నపిల్లలను విద్యుత్‌లైన్‌లు, స్తంభాల దగ్గరకు రానివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- స్విచ్‌బోర్డు వద్ద రబ్బరు మ్యాట్, అగ్నిప్రమాద నిరోధకాలు అందుబాటులో ఉంచుకోవాలి.
- నిమజ్జన శోభయాత్రలో రద్దీ ప్రాంతాల్లో అనుభవం ఉన్న ఎలక్ట్రీషియన్‌ను వెంట ఉంచుకోవడం మంచిది.

నిమజ్జన సమయంలో..

- నిమజ్జన శోభాయాత్రలో కండీషన్ ఉన్న వాహనాలనే వాడాలి.
- శోభాయాత్రకు వినియోగించే ఆటోలు, ట్రాక్టర్లు, ఇతర వాహనాల టైర్లు, బ్రేక్‌లు సరిగ్గా ఉన్నవే అద్దెకు తీసుకోవాలి.
- నిమజ్జన సమయంలో వాహనాలను అనుభవం ఉన్న డ్రైవర్లే నడపేలా చూడాలి.
- ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్నాయి. ప్రాజెక్టులు, నదులు,చెరువులు నీటితో నిండుగా ఉన్నాయి. చీకటి పడే సమయానికి ముందే నిమజ్జనాలు జరిగేలా చూడాలి.
- ఎక్కువ నీటిలోకి వెళ్లకుండా ఒడ్డునుంచే నిమజ్జనం చేయాలి. కొంత మంది మండలి సభ్యులు, యువకులు కేరింతలు కొడుతూ వినాయక విగ్రహాలను మోసుకొని నేరుగా నీటిలోకి వెళ్తారు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్న ప్రమాదం తప్పదు. ఈత రాని వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ నిమజ్జనం కోసం నీటిలోకి పంపించవద్దు.

ప్రశాంతంగా జరుపుకోవాలి

వినాయక ఉత్సావాలను కలిసి కట్టుగా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగిన ఉత్సవ కమిటీ సభ్యులదే పూర్తి బాధ్యతగా వ్యవహరించి చర్యలు తీసుకుంటాం. ఉత్సవాల్లో ఎట్టి పరిస్థితుల్లోను డీజేలకు అనుమతి లేదు. ప్రభుత్వ నిబంధనలను ప్రతిఒక్కరూ పాటించాలి

– అశోక్‌బాబు, ఎస్‌ఐ, మాగనూర్

చలానా చెల్లించాలి

వినాయ మండపాల దగ్గర విద్యుత్ కనెక్షన్‌ల కోసం 250 వాట్స్‌కు రూ. 500, 250 నుంచి 500 వాట్స్‌కు రూ.1000, 500 వాట్స్ పై బడి ఉంటే రూ. 1500 చలానా చెల్లించాల్సి ఉంటుంది. అలా కాదని మండపాల వారు సొంతంగా కనెక్షన్లు తీసుకోవడం నేరం. ముఖ్యంగా విద్యుత్ పనులు సొంతంగా చేసుకోవడం వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఏ చిన్న సమస్య తలెత్తినా విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించాలి.

– గంగాధర్‌రావు, విద్యుత్ ఏఈ, మాగనూర్

42 ఏళ్ల తరువాత కలుసుకున్న మిత్రులు



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

ధన్వాడ: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 1982–83 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు 42 ఏళ్ల తరువాత కలుసుకున్నారు. ఆదివారం వారు చదువుకున్న పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి ఒకరి బాగోగులు ఒకరు తెలుసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువుల పాదాలు కడిగి పాదాభివందనం చేశారు. అలాగే తరగతి గదులలో తాము చిన్నప్పుడు చేసిన అల్లరిని, తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని రోజంతా ఆనందంగా గడిపారు.

విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

- ధన్వాడలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో 2000–2010 వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ వార్డెన్‌లను, పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం హాస్టల్ విద్యార్థుల కోసం తమ వంతుగా బోర్డులు, ప్రాజెక్టుకు పనికొచ్చే నోటుపుస్తకాలు, ప్యాడ్స్, పెన్నులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డెన్ విజయకుమార్, సాయిరెడ్డి, యాదయ్య, ఉపాధ్యాయులు రాజు, నరేందర్, చంద్రకాంత్, సలీం తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో విద్యార్థులు

హిందూ సంప్రదాయాలను పాటించాలి



మాట్లాడుతున్న చించోల్కర్ నాగరాజు

కోస్గి రూరల్: మన దేశ సనాతన ధర్మాన్ని, సంప్రదాయాలను పాటించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పాలమూరు జిల్లా విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు చించోల్కర్ నాగరాజు, ఉపాధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి అన్నారు. విశ్వ హిందూ పరిషత్ కోస్గి ప్రఖండ అనివాస్‌వర్గ కార్యక్రమాన్ని ఆదివారం మండల పరిధిలోని నాచారం గ్రామంలోని ఉపనిషత్ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోమాతను రక్షించుకోవాలన్నారు. అలాగే పండగలను హిందూ సాంప్రదాయబద్ధంగా, సనాతన ధర్మం ఉట్టిపడేలా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో హన్మంతు, జనార్దన్, వెంకట్రాములు, బుచ్చిరెడ్డి, అంజయ్య ఉన్నారు.

కార్మికుల సమస్యలపై దృష్టిపెట్టాలి



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: స్కీం వర్కర్లు, అసంఘటిత కార్మికులు, సాంప్రదాయ కార్మికులే కాకుండా ఉత్పత్తి రంగాలైన కీలకమైన పరిశ్రమలు, విద్యుత్, ట్రాన్స్‌పోర్ట్, రైల్వే తదితర అత్యంత కీలకమైన రంరాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలపై దృష్టి కేంద్రీకరించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి సూచించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడారు. పోలేపల్లి సెజ్, బాలానగర్ నుంచి అడ్డాకుల వరకు ఉన్న పరిశ్రమల్లోని ఫార్మా ఉత్పత్తి రంగాల్లో పనిచేస్తున్న కార్మికులను సంఘటిత పరిచేందుకు సంఘాల ఏర్పాటుకు కృషిచేయాలన్నారు. ఉత్పత్తిని స్తంభింపజేసే వాటిపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. పారిశ్రామిక కార్మికవర్గాన్ని ఐక్యం చేస్తూ జిల్లా ఉద్యమాలను విస్తృత పర్చాలన్నారు. సీఐటీయూ సీనియర్ నాయకుడు కిల్లెగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తి మాట్లాడుతూ.. పరిశ్రమల్లో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కార్మికులకు కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్, గ్రాట్యూటీ వంటి సౌకర్యాలు కల్పించకుండా యాజమాన్యాలు శ్రమదోపిడీ చేస్తున్నాయన్నారు. దీనిపై నిర్దిష్టంగా సర్వేలు చేసి అధికారులకు వినతులు ఇవ్వాలని, పారిశ్రామిక కార్మికులపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు రాములు, ఖమర్‌అలీ, తిరుమలయ్య, వేణుగోపాల్, రాజ్‌కుమార్, చంద్రకాంత్, ఆంజనేయులు, నారాయణ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఆరోపణలు అర్థరహితం

ఆత్మకూర్: మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆరోపణలు అర్థరహితమని, పదేళ్ల అధికారంలో ఉండి అభివృద్ధిని పూర్తిగా విస్మరించి, ఇప్పుడు నీతులు మాట్లాడుతున్నారని ఆత్మకూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రహ్మతుల్లా అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆత్మకూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా చేస్తామని ప్రగల్బాలు పలికిన చిట్టెం ఆ దిశగా.. అడుగులు వేయలేదని ధ్వజమెత్తారు. పంటలను ఎండబెట్టినప్పుడు నోరు మెదపకుండా ప్రస్తుతం రైతులకు రెండు పంటలకు నీరు అందుతుంటే సహించలేకపోతున్నారని దుయ్యబట్టారు. యూరియా విషయంలో బీజేపీ ఎంపీని ప్రశ్నించాల్సింది పోయి మంత్రి వాకిటి శ్రీహరిపై ఆరోపణలు చేయడమేమిటని ప్రశ్నించారు.

26న క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

నారాయణపేట రూరల్: పట్టణంలో ఈ నెల 26న లైన్స్ క్లబ్, రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే చిట్టెం నర్సిరెడ్డి జయంతి సందర్భంగా ఉచిత క్యాన్సర్ నిర్ధారణ చికిత్సా శిబిరం నిర్వహిస్తున్నట్లు లైన్స్ క్లబ్ ప్యాట్రాన్ హరినారాయన్ బట్టడ్, రెడ్ క్రాస్ చైర్మన్ సుదర్శన్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి డాక్టర్ల సహకారంతో శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాంగ్రెస్‌కు మూకుమ్మడి రాజీనామాలు



నర్వ: మండలంలోని ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం పార్టీకి రాజీనామ చేస్తున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీలోని అంతర్గత సమస్యలపై అనేక మార్లు మంత్రి దృష్టికి, జిల్లా అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లినా న్యాయం జరగకపోవడంతో రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. పదేళ్లుగా పార్టీకి ఎన్నో సేవలందించామని, గత ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు ఎంతో కృషి చేశామని అయినా తమకు సరైన గుర్తింపు ఇవ్వనందుకు విసుగు చెంది పార్టీకి మూకుమ్మడిగా రాజీనామ చేస్తున్నామన్నారు. రాజీనామా చేసిన వారిలో నీరజ్ ఉందేకోడ్ మాజీ ఎంపీటీసీ, సంద్యాంజనేయులు నర్వ మాజీ సర్పంచు, లక్ష్మణ్‌గౌడ్ ఉందేకోడ్, అంజిల్‌రెడ్డి, రాజుపల్లి, బొజ్జన్న నర్వ, వెంకటన్న తదితరులున్నారు.

ఎమ్మార్పీఎస్ కమిటీ ఎన్నిక

ఊట్కూరు: మండలంలోని పులిమామిడి గ్రామంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ హనుమంతు మాదిగ ఆధ్వర్యంలో గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తిరుమలేష్, ఉపాధ్యక్షుడిగా శంకర్, ప్రధాన కార్యదర్శిగా నరేష్, అధికార ప్రతినిధి కృష్ణ, కార్యదర్శి శ్రీనివాసులు, కోశాధికారి కృష్ణ, ప్రచార కార్యదర్శిగా కత్తలప్పను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కృష్ణయ్య, బాలప్ప, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేత చిన్నరేవల్లి జట్టు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో శనివారం రాత్రి వరకు నిర్వహించిన ఈశా గ్రామోత్సవం పురుషుల వాలీబాల్ పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ పోటీల్లో 22 జట్లు పాల్గొన్నాయి. చిన్నరేవల్లి జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో చిన్నరేవల్లి జట్టు 25–19, 25–14 సెట్ల తేడాతో మరికల్ జట్టుపై విజయం సాధించింది. మూడో స్థానంలో నవాబ్‌పేట, నాలుగో స్థానంలో పోలేపల్లి జట్లు నిలిచాయి. విన్నర్, రన్నర్ జట్లకు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి చెన్నవీరయ్య తదితరులు ట్రోఫీలు, సర్టిఫికెట్లు, నగదు బహుమతులు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో జల్దిబిందె ఊరేగింపు



కొల్లంపల్లిలో పల్లకీని ఊరేగిస్తున్న భక్తులు

నారాయణపేట రూరల్: మండలంలోని కొల్లంపల్లి గ్రామంలో పద్మశాలి కుల దైవమైన ముద్దులమ్మ జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కులపెద్దల ఆధ్వర్యంలో గ్రామ పురవీధుల గుండా భజన సంకీర్తనలతో జల్దిబిందె, పల్లకీ సేవా కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆలయంలో అమ్మవారి పూజా కార్యక్రమం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు

నారాయణపేట టౌన్: త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక నారాయణపేట మఖ్తల్ కమిటీ వారి ఆధ్వర్యంలో తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఆదివారం ముగిశాయి. నారాయణపేట మోనప్ప కాలనీలో తిరుపతి ఇంటి వద్ద ప్రతి రోజు జ్ఞాన రీత్యా నిత్య పూజలు చేసి ఆదివారం చివరి రోజు భక్తులందరూ కలిసి స్వామిని పుష్పాలతో అలంకరించి శ్రీ కృష్ణా చరమామృతం చదివి, పూజలు చేసి శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా ముగించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, నాగనాయక్, ఈశ్వరయ్య, రామ్‌రెడ్డి, బుచ్చిలింగం, తిరుపతయ్య పాల్గొన్నారు.

దేవరగట్టుపై బారులు తీరిన భక్తులు



స్వామివార్ల దర్శనానికి బారులు తీరిన భక్తులు

కొత్తపల్లి: శ్రావణమాస ముగింపుతో మండల పరిధిలోని నిడ్జింత శివారులో దేవరగట్టుపై వెలసిన తిరుమల స్వామి ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకున్నారు. శ్రావణమాస ముగింపుతో ఆదివారం గట్టు జాతరకు వేలాదిగా హాజరై గుట్టపై వెలసిన తిరుమల స్వామిని దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. ఆలయకమిటీ సభ్యులు రాజశేఖర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసి అన్ని వసతులు కల్పించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మద్దూరు పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

న్యాయమైన పరిహారం చెల్లించాలి



రిలే దీక్షల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు

దామరగిద్ద: పేట–కొడంగల్ ఎత్తిపోతల పథకంలో కాన్‌కుర్తి రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న భూ నిర్వాసితులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని కాన్‌కుర్తిలో రైతులు చేపట్టిన 18వ రోజు రిలే దీక్షల్లో పాల్గొని మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు సంజీవ్‌గౌడ్, జిల్లా నాయకులు గోపాల్‌రావ్, చంద్రశేఖర్ రెడ్డిలు మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టుకు వ్యతిరేకం కాదని, తమకు జీవనాధారమైన భూములను కోల్పోతున్నందుకు మార్కెట్ విలువ ప్రకారం ఎకరాకు రూ.35 లక్షలు అందించాలని చేస్తున్న న్యాయమైన పోరాటానికి ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో చంద్రశేఖర్ రెడ్డి, రాజశేఖర్‌గౌడ్, వెంకట్రాములు, నారాయణ, అంజయ్యగౌడ్, నబీ స్థానిక బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలి

మాగనూర్: ప్రభుత్వం వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎల్లారెడ్డి ప్రకటనలో కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలైనా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడంతో గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు పెరిగిపోయాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి లోకల్ ఎలక్షన్స్ నిర్వహించకుండా, పంచాయతీలకు నిధులు కేటాయించకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు అప్పులు చేసి పనులు చేయిస్తున్నారు. అలాగే గ్రామ వ్యవస్థ కుంటుపడిందని మండలంలోని నేరడగం గ్రామంలో 15 రోజుల నుంచి చెత్త సేకరణ ట్రాక్టర్ గ్రామపంచాయతీ ముందు దిష్టిబొమ్మలా దర్శనమిస్తుందన్నారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శుల దగ్గర ప్రస్తావించగా ఇప్పటికే అప్పులు చేసి మరీ పనులు చేయిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

రోడ్డుపై గుంతలను పూడ్చండి



మాగనూర్ సమీపంలో రోడ్డుపై ప్రమాదకరంగా గుంతలు

మాగనూర్: మండలకేంద్రంలోని అంతర్‌రాష్ట్ర రహదారి గుంతలు పడి అధ్వానంగా తయారైంది. రహదారి విస్తరణలో భాగంగా రెండు నెలల క్రితమే రోడ్డును నిర్మించారు. అధికారుల పర్యవేక్షణ లోపం కాంట్రాక్టర్ నిర్లక్ష్య ధోరణితో నిర్మించిన రెండు నెలలకే రోడ్డు గుంతలమయంగా మారింది. నేషనల్‌హైవే కావడంతో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయని ఎక్కువగా దూర ప్రాంతాల ప్రజలు వస్తుండటంతో ఎక్కడ ఏ గుంత ఉందో కనిపించక ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా నేషన్ హైవే సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన గుంతలకు పూడ్చివేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

సామాజిక చైతన్యం తేవడమే ధ్యేయం



సమావేశానికి హాజరైన స్వయం సేవకులు

నారాయణపేట క్రైమ్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలలో సమాజంలోని అన్ని వర్గాలను భాగస్వామ్యం చేయాలని రిటైర్డ్ ప్రొఫెసర్ అన్నదానం సుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని అభినందన గార్డెన్‌లో ఊట్కూర్ మండల, నారాయణ పేట గ్రామీణ సర్వ స్వయం సేవకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య వక్తగా హాజరై మాట్లాడుతూ..ప్రతి స్వయం సేవకుడు సద్భావన, సమన్వయంతో ప్రతి ఒక్కరిని కలుపుకొని శతాబ్ది ఉత్సవాలలో భాగస్వాములను చేయాలని పేర్కొన్నారు. సంఘాన్ని పటిష్ట పరచడంలో భాగంగా సమాజమే సంఘంగా, సంఘమే.. సమాజంగా సామాజిక చైతన్యం నిర్మాణం చేయాలని పిలుపునిచ్చారు. ఈ శతాబ్ది ఉత్సవాలకు సంఘం ప్రచారం కన్నా విస్తరణ, బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఆర్ఎస్ఎస్ శాఖతో పరిచయం ఉన్న ప్రతి ఒక్కరిని శతాబ్ది ఉత్సవాలకు సిద్ధం చేయాలన్నారు. రాబోయే విజయదశమి నాటికి ఉత్సవాలు గ్రామ గ్రామానా పథసంచలనం చేయాలని,గ్రామ జనాభాలో ఒక శాతం సంఖ్య రూట్ మార్చ్‌లో పాల్గొనేలా చూడాలని, బృందాలుగా ఏర్పడి ప్రతి ఇంటిని సంపర్కం చేయాలని సూచించారు. కార్యక్రమంలో రథసారతి రాంరెడ్డి, సీనియర్ నాయకులు గరిడి నింగిరెడ్డి, మరాఠి వెంకట్ రాములు, మ్యడం లక్ష్మణ్,పృథ్వి, బాలాంజనేయులు, పలువురు యువకులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గుంత.. ఆదమరిస్తే అంతే



మండల పరిధిలోని వడ్వాట్ గ్రామంలో నిర్మించిన డ్రెయినేజీ మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా మారిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పలుచోట్ల మ్యాన్‌హోల్ మూతలు ధ్వంసమై ఉండడంతో రాత్రి వేళల్లో ప్రమాదం జరిగే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. ముఖ్యంగా గ్రామ ప్రధాన రహదారి నుంచి ఒకటో అంగన్‌వాడీ కేంద్రం వైపు వెళ్లే దారిలో మ్యాన్‌హోల్ మూత ధ్వంసం కావడంతో పంచాయతీ సిబ్బంది అలాగే వదిలేశారు. దీంతో డ్రెయినేజీ మొత్తం మట్టితో నిండిపోయి మురుగు ముందుకు పోకపోవడంతో దుర్వాసన సైతం వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి డ్రెయినేజీ వ్యవస్థని బాగు చేయాలని కోరుతున్నారు. – మాగనూర్